నాలాలను పునరుద్ధరించాలి

ఘట్‌కేసర్, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని జోడిమెట్ల చౌరస్తా వద్ద నాలాలను పునరుద్ధరించాలని కోరుతూ హిమగిరి కాలనీవాసులు సోమవారం హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో హైడ్రా అధికారులను కలిసి నాలాల ఆక్రమణలతో ఇళ్లల్లోకి వరద వస్తోందని వాపోయారు. అబ్బవతిని నర్సింహ, అకిటి కృష్ణారెడ్డి, గవ్వల రాములు, శ్రీనివాస్, రవికుమార్, భరత్‌రెడ్డి, నివాస్‌రెడ్డి, రాజిరెడ్డి తదితరులున్నారు.

ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి

దరఖాస్తులు స్వీకరించిన అధికారులు

మేడ్చల్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/వికారాబాద్, సెప్టెంబరు 29: ప్రజావాణికి ప్రాధాన్యమిస్తూ ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 43 ఫిర్యాదులు రాగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల దరఖాస్తులను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్ఓ మంగీలాల్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

మేడ్చల్‌లో 58 ఫిర్యాదులు

ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే సమస్యలను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో డీఆర్‌ఓ హరిప్రియతో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రజావాణికి మొత్తం 58 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు.

సందడిగా సద్దులు

పూల వనాలైన పల్లెలు, పట్టణాలు

ఆటపాటల్లో ఆడపడుచులు, పిల్లలు

ఆకట్టుకున్న బతుకమ్మలు.. తీరొక్క ప్రసాదాలు



మేడ్చల్ కలెక్టరేట్‌లో బతుకమ్మలతో అదనపు కలెక్టర్ రాధికా గుప్తా



బొంరాస్‌పేట్: పూర్యానాయక్ తండాలో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు



తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. సోమవారం సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని పల్లెలు, పట్టణాలు పూల వనాలయ్యాయి. ప్రతి ఇంటా తీరొక్క పూలతో భక్తిశ్రద్ధలతో బతుకమ్మలను పేర్చి మధ్యలో గౌరమ్మను పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం వేళ అంతా ఒకచోట చేరి ఆటాపాటలతో సందడి చేశారు. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో' అంటూ ఆటపాటలతో హోరెత్తించారు. ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకొన్నారు. అనంతరం బతుకమ్మలను సమీపంలోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, సెప్టెంబరు 29



పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు





వికారాబాద్‌లోని వెంకటేశ్వర ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



సామూహిక కుంకుమార్చనలో మహిళలు

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన

పరిగి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పరిగిలోని టీచర్స్ కాలనీలోని అమృతాంజనేయస్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఎనిమిదవ రోజు సోమవారం సరస్వతీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయంలో మహిళలు భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు పూజలు చేసి అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్నారు.

గజవాహన సేవపై అనంతపద్మనాభ స్వామి



వికారాబాద్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలంపల్లి శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. నిత్య వాహన పూజలో భాగంగా సోమవారం స్వామి వారిని గజ వాహనంపై ఊరేగించారు. ఆలయ పరిసరాలలు, గ్రామపుర వీధుల గుండా స్వామి వారిని ఊరేగించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి పద్మనాభం, కార్య నిర్వాహణాధికారి నరేందర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తుండగా పట్టణ ప్రముఖులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సంగ్రామం



పరిషత్, పంచాయతీ ఎన్నికలకు మోగిన నగారా

- రెండు విడతల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎలక్షన్లు
- మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు
- అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్

స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌ను సోమవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని ప్రకటించడంతో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. మొత్తం ఐదు విడతల్లో ఎన్నికలు జరగనుండగా, మొదటి, రెండు విడతల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, ఆ తర్వాత మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు. అందుకు తగ్గట్టు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. అక్టోబరు 9వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఎన్నికల ప్రక్రియ నవంబరు 11వ తేదీ వరకు కొనసాగనుంది. దీంతో గ్రామాల్లో బతుకమ్మ, దసరా పండుగతోపాటు ఎన్నికల హడావుడి నెలకొంది.

వికారాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తొలి విడత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు అక్టోబరు 9వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఆ రోజు నుంచి 11వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 12వ పరిశీలన, 15న ఉప సంహరణ, 23వ తేదీన పోలింగ్ జరుగుతుంది. రెండో విడత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు అక్టోబరు 13న నోటిఫికేషన్ విడుదల చేసి అదే రోజు నుంచి 15వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 16న నామినేషన్ల పరిశీలన,



19 వరకు ఉప సంహరణకు గడువు, 27వ తేదీన ఎన్నికలు జరుగుతాయి. 11వ తేదీన ఎంపీటీసీ, జెడ్పీటీసీల ఓట్ల లెక్కింపు జరగనుంది.

రెండు విడతల్లో ప్రాదేశిక ఎన్నికలు

జిల్లాలో మొత్తం 20 జెడ్పీటీసీ, 227 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో తొలి విడతలో కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, దుద్యాల్,

మిగతా 8వ పేజీలో...



పంచాయతీ, పరిషత్ స్థానాలు	
జెడ్పీటీసీ	20
ఎంపీటీసీ	227
పంచాయతీలు	594
వార్డులు	5,058
ఓటర్ల వివరాలు	
పురుషులు	3,43,668
మహిళలు	3,54,788
ఇతరులు	16
మొత్తం	6,98,472


అప్రమత్తంగా ఉండాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల అధికారి రాణి కుముదిని నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు రెండు విడతల్లో, గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో తక్షణమే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల ప్రవర్తనా నియమావళి) అమలులోకి వచ్చిందని తెలిపారు. రాజకీయ ప్రచారాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు, గోడ రాతలు తొలగించాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్



జెడ్పీ చైర్మన్ అభ్యర్థి నిర్ణయం సీఎందే..

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ అభ్యర్థి ఎవరన్నది సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయిస్తారని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో మీడియాతో మాట్లాడుతూ సీఎం సొంత జిల్లా కావడంతో సీఎం రేవంత్‌రెడ్డి మదిలో ఎవరన్నది తెలియదని పేర్కొన్నారు. నోటిఫికేషన్ లోపు అభ్యర్థి ఖరారు అవుతారని చెప్పారు. రిజర్వేషన్లు పారదర్శకంగా జరిగాయని, ఇందులో ఎవరి ప్రమేయం లేదని తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఎస్సీ రిజర్వుడ్ ఉంటే స్పీకర్ ప్రసాద్‌కుమార్ కుతురుకు అవకాశం ఉండేదని చెప్పారు. జెడ్పీ చైర్మన్ అభ్యర్థి ఎవరనేది జిల్లా ఎమ్మెల్యేలకు తెలియదని పేర్కొన్నారు.



7

బురద రోడ్డుతో అవస్థలు

వాహనదారులకు తప్పని ఇక్కట్లు

స్థానిక ఎన్నికల్లో బీజేపీదే గెలుపు

పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

మర్పల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మర్పల్లి మండలంలోని రావులపల్లి, దామస్తాపూర్ గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. రైతులతో మాట్లాడి జరిగిన నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, నాయకులు యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న జిల్లా వైద్యాధికారి ఉమాగౌరి

మహిళా సిబ్బందికి క్రీడా పోటీలు

మేడ్చల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులు, సిబ్బందికి సోమవారం జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. చెస్, మ్యూజికల్ చైర్, రన్నింగ్, టగ్ ఆఫ్ వార్ వంటి క్రీడా పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ఉమాగౌరి, జిల్లా అధికారులు వినోద్, రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ల కేటాయింపు

కలెక్టర్‌కు రిపోర్ట్ చేసిన చంద్రకిరణ్, పూజా యాదవ్

వికారాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గ్రూప్-1లో డిప్యూటీ కలెక్టర్లుగా ఎంపికైన పెండ్యాల చంద్రకిరణ్, పూజాయాదవ్ సోమవారం కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు రిపోర్ట్ చేశారు. రెవెన్యూ సంబంధిత అంశాల్లో క్షేత్ర స్థాయిలో శిక్షణ పొందడానికి ప్రభుత్వం ఈ ఇద్దరినీ వికారాబాద్ జిల్లాకు కేటాయించింది. ఈ సందర్భంగా చంద్రకిరణ్ తన సతీమణి, తండ్రితో కలిసి కలెక్టర్‌కు పుష్ప గుచ్ఛం అందజేయగా, ఆయన వారిని అభినందించారు. సేల్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన చంద్రకిరణ్ గ్రూప్-1లో 57వ ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్ పోస్టుకు ఎంపికయ్యారు. గ్రూప్-4లో ఎంపికైన ఆయన కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా చేరారు. గతంలో సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది పంజాగుట్ట డివిజన్ శ్రీనగర్ కాలనీ సర్కిల్‌లో విధులు నిర్వహించారు. గ్రూప్-2లో 140వ ర్యాంకు సాధించి జీఏడీలో ఏఎస్‌వో అయ్యారు. గ్రూప్-3లో కూడా టాప్ ర్యాంకు సాధించారు. గ్రూప్-4 నుంచి గ్రూప్-1 వరకు నాలుగు పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించారు. అలాగే పూజా యాదవ్ గ్రూప్-1లో 26వ ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. గ్రూప్-4లో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికైన ఆమె సాంఘిక సంక్షేమ శాఖలో విధులు నిర్వహిస్తూ గ్రూప్-1 ఉద్యోగం సాధించారు.



కలెక్టర్‌తో చంద్రకిరణ్, ఆయన సతీమణి







మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



అబద్ధాల కాంగ్రెస్‌కు కాలం చెల్లింది

బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మోపు వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ నిజస్వరూపాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నంలో జరిగిన పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నివర్గాలకు మేలు చేసిన కేసీఆర్‌ను కాదనుకుని, కాంగ్రెస్ పార్టీని నమ్మిన ప్రజలు తాము మోసపోయామని గ్రహించారన్నారు. రైతులు, కూలీలు, మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అడిగితే పోలీసులతో నిర్దాక్షిణ్యంగా అణచివేస్తున్నారంటూ ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై ఇంటింటికి వెళ్లి గుర్తు చేయాల్సిన బాధ్యత బీఆర్ఎస్ కార్యకర్తలపై ఉందన్నారు. సమర్థులైన నాయకులు, పార్టీ కోసం పని చేసే వారిని స్థానిక ఎన్నికల్లో నిలబెట్టి గెలుపించుకుందామంటూ ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, నాయకులు సత్తు వెంకటరమణారెడ్డి, జక్క రాంరెడ్డి, దండెం రాంరెడ్డి, ఆకుల యాదగిరి, పల్లె గోపాల్‌గౌడ్, బూడిద రాంరెడ్డి, చక్రవర్తిగౌడ్, పార్టీ మండల అధ్యక్షులు కర్నాటి రమేష్‌గౌడ్, చిలుకల బుగ్గరాములు, చీరాల రమేష్, కిషన్‌గౌడ్, మున్సిపల్ అధ్యక్షులు అల్వాల వెంకట్‌రెడ్డి, జంగయ్య, కల్యాణ్‌నాయక్, బలరాం పాల్గొన్నారు.

మోగిన నగారా

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): స్థానిక ఎన్నికలకు నగారా మోగింది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం అయిదు దశల్లో స్థానిక ఎన్నికలు నిర్వహిస్తుండగా.. జిల్లాలో మాత్రం నాలుగు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. తొలి రెండు దశల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు, అలాగే తొలి రెండు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీలకు తొలివిడత అక్టోబరు 23వ తేదీన, రెండో విడత అదే నెల 27వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. నవంబరు 11న ఎంపీటీసీ, జెడ్పీ టీసీ ఓట్ల లెక్కింపు జరగనుంది. గ్రామ పంచాయతీ ఎన్నికలను రాష్ట్రంలో మూడు విడతలుగా నిర్వహిస్తున్నప్పటికీ జిల్లాలో మాత్రం తొలిరెండు విడతల్లో ఎన్నికలు పూర్తికానున్నాయి. తొలివిడత గ్రామ పంచాయతీ ఎన్నికలు అక్టోబరు 31వ తేదీన, రెండో విడత వచ్చే నవంబరు 4వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. పోలింగ్ పూర్తయిన తరువాత అదేరోజు గ్రామ పంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనుంది. జిల్లాలో మొత్తం 21జడ్పీటీసీ స్థానాలు, 230 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అలాగే 526 పంచాయతీల పరిధిలోని సర్పంచ్ స్థానాలతో పాటు 4668 మంది వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

అమల్లోకి కోడ్

ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఎన్నికల ప్రవర్తనా నియామవళి (కోడ్) రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. దీంతో ప్రభుత్వ పరంగా జరిగే అన్ని కార్యక్రమాలను అధికారులు నిలిపివేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి జరుగుతుండగా ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో అధికారులు నిలిపివేశారు. అయితే కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులు మాత్రం స్వీకరించారు.

ఓటర్లు 7,52,259 మంది

తుది ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 7,52,259 మంది గ్రామీణ ఓటర్లు ఉండగా, వీరిలో 3,76,873 మంది పురుషులు, 3,75,408 మంది మహిళలు, 28 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలో అత్యధికంగా 51,104 మంది ఓటర్లు, అత్యల్పంగా ఆమన్‌గల్‌లో 14,712 మంది ఓటర్లు

పరిషత్ సమరం ఇలా..

తొలి విడత అంటే అక్టోబరు 23వ తేదీన చేవెళ్ల, కందుకూరు, రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 110 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అలాగే రెండో విడత అక్టోబర్ 27వ తేదీన షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం డివిజన్లలోని 120 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

రెండు దశల్లో పంచాయతీ ఎన్నికలు

తొలి విడత అంటే అక్టోబర్ 31వ తేదీన చేవెళ్ల, కందుకూరు, రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 264 పంచాయతీలు, 2300 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అలాగే రెండో విడత నవంబర్ 4వ తేదీన 262 పంచాయతీలు, 2368 వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు జరగనున్నాయి.

పకడ్బందీగా.. ప్రశాంతంగా..

స్థానిక ఎలక్షన్లను ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరిస్తూ పకడ్బందీగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులకు ఆదేశించారు. స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ఆర్డీఓలు, ఎంపీడీఓలు ఇతర అధికారులతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికలను రెండు విడతలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 9వ తేదీన నోటిఫికేషన్ విడుదలవుతుందని తెలిపారు. నిర్దేశించిన తేదీల్లో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. స్థానిక ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని సూచించారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతిఒక్కరూ తమకు కేటాయించిన విధులను నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, నోడల్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తొలివిడత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు	
నామినేషన్ల స్వీకరణ	: అక్టోబరు 9
స్వీకరణకు చివరి తేదీ	: అక్టోబరు 11
పరిశీలన	: అక్టోబరు 12
నామినేషన్ల ఉపసంహరణ	: అక్టోబరు 15
ఎన్నికల తేదీ	: అక్టోబరు 23
ఓట్ల లెక్కింపు	: నవంబరు 11

రెండో విడత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు	
నామినేషన్ల స్వీకరణ	: అక్టోబరు 13
స్వీకరణకు చివరి తేదీ	: అక్టోబరు 15
పరిశీలన	: అక్టోబరు 16
నామినేషన్ల ఉపసంహరణ	: అక్టోబరు 19
ఎన్నికల తేదీ	: అక్టోబరు 27
ఓట్ల లెక్కింపు	: నవంబరు 11

తొలివిడత గ్రామ పంచాయతీ ఎన్నికలు	
నామినేషన్ల స్వీకరణ	: అక్టోబరు 17
స్వీకరణకు చివరి తేదీ	: అక్టోబరు 19
పరిశీలన	: అక్టోబరు 20
నామినేషన్ల ఉపసంహరణ	: అక్టోబరు 23
ఎన్నికల తేదీ, ఫలితాలు	: అక్టోబరు 31

రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు	
నామినేషన్ల స్వీకరణ	: అక్టోబరు 21
స్వీకరణకు చివరి తేదీ :	: అక్టోబరు 23
పరిశీలన	: అక్టోబరు 24
నామినేషన్ల ఉపసంహరణ	: అక్టోబరు 27
ఎన్నికల తేదీ, ఫలితాలు	: నవంబరు 04

జెడ్పీటీసీ రిజర్వేషన్ ఇలా

కేటగిరీ	రిజర్వు స్థానాలు	మహిళలు	పురుషులు/మహిళలు
షెడ్యూల్ తెగలు	03	01	02
షెడ్యూల్ కులాలు	04	02	02
వెనుకబడిన తరగతులు	09	04	05
జనరల్	05	02	03
మొత్తం	21	09	12

షెడ్యూల్ తెగలు (జెడ్పీటీసీ)	
మండలం	రిజర్వుడు కేటగిరీ
మంచాల	ఎస్టీ
కొత్తూరు	ఎస్టీ
ఫరూఖ్‌నగర్	ఎస్టీ(మహిళ)
షెడ్యూల్ కులాలు	
శంకరపల్లి	ఎస్సీ
చేవెళ్ల	ఎస్సీ
కందుకూరు	ఎస్సీ (మహిళ)
షాబాద్	ఎస్సీ (మహిళ)
వెనుకబడిన తరగతులు	
మెయినాబాద్	బీసీ (మహిళ)
కొందుర్గు	బీసీ
ఇబ్రహీంపట్నం	బీసీ (మహిళ)
కేశంపేట	బీసీ
యాచారం	బీసీ
మహేశ్వరం	బీసీ (మహిళ)
తలకొండపల్లి	బీసీ
మాడ్గుల	బీసీ
కడ్తాల్	బీసీ (మహిళ)
జనరల్	
అబ్దుల్లాపూర్‌మెట్	జనరల్ (మహిళ)
జిల్లెల చౌదరిగూడ	జనరల్
నందిగామ	జనరల్ (మహిళ)
శంషాబాద్	జనరల్
ఆమన్‌గల్	జనరల్

షెడ్యూల్ తెగలు (ఎంపీటీసీ)	
మండలం	రిజర్వుడు కేటగిరీ
కొత్తూరు	ఎస్టీ (మహిళ)
ఫరూఖ్‌నగర్	ఎస్టీ
తలకొండపల్లి	ఎస్టీ
షెడ్యూల్ కులాలు	
శంకర్‌పల్లి	ఎస్సీ (మహిళ)
చేవెళ్ల	ఎస్సీ
షాబాద్	ఎస్సీ
శంషాబాద్	ఎస్సీ (మహిళ)
వెనుకబడిన తరగతులు	
జిల్లెల చౌదరిగూడెం	బీసీ
మొయినాబాద్	బీసీ
కొందుర్గు	బీసీ
ఇబ్రహీంపట్నం	బీసీ (మహిళ)
కేశంపేట	బీసీ (మహిళ)
కందుకూరు	బీసీ (మహిళ)
యాచారం	బీసీ
మహేశ్వరం	బీసీ (మహిళ)
మంచాల	బీసీ
జనరల్	
అబ్దుల్లాపూర్‌మెట్	జనరల్ (మహిళ)
నందిగామ	జనరల్
మాడ్గుల	జనరల్
కడ్తాల్	జనరల్ (మహిళ)
ఆమనగల్	జనరల్

మండల పరిషత్ అధ్యక్ష స్థానాల రిజర్వేషన్ ఇలా...

కేటగిరీ	రిజర్వు స్థానాలు	మహిళలు	పురుషులు/మహిళలు
షెడ్యూల్ తెగలు	03	01	02
షెడ్యూల్ కులాలు	04	02	02
వెనుకబడిన తరగతులు	09	04	05
జనరల్	05	02	03
మొత్తం	21	09	12

ఆమనగల్లు లయన్స్ క్లబ్‌కు అవార్డుల పంట

- గ్రామీణ క్లబ్‌లలో ఆమనగల్లు అగ్రస్థానం
- క్లబ్ ఉత్తమ అధ్యక్షుడిగా పసుల లక్ష్మారెడ్డి



అవార్డులతో ఆమనగల్లు లయన్స్ క్లబ్ బృందం

ఆమనగల్లు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు లయన్స్ క్లబ్‌కు అవార్డుల పంట పండింది. సామాజిక సేవా కార్యక్రమాల్లో 2024-25 సంవత్సరానికి అత్యుత్తమ క్లబ్‌గా ఎంపికైంది. లయన్స్‌క్లబ్-320 జిల్లా పరిధి 92 క్లబ్‌లలో అగ్రభాగాన నిలిచింది. క్లబ్ జిల్లా అవార్డుల ప్రదాన కార్యక్రమం సోమవారం హైదరాబాద్ కర్మన్‌ఘాట్‌లో లయన్స్‌క్లబ్ గవర్నర్ కోటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డికి ఉత్తమ అవార్డు లభించింది.క్లబ్ సీనియర్ సభ్యుడు డాక్టర్ పి.దామోదర్‌రెడ్డి బృందం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలకు, క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన మీల్స్ అండ్ వీల్స్ కార్యక్రమానికి అవార్డులొచ్చాయి. ఎంజేఎఫ్, సభ్యత్వ నమోదులో గుర్తింపు లభించింది. ఆమనగల్లు లియోక్లబ్ ఉత్తమ క్లబ్ అవార్డు అందుకుంది. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ మహేందర్ కుమార్‌రెడ్డి, అంతర్జాతీయ మాజీ డైరెక్టర్ సునిల్‌కుమార్, మాజీ గవర్నర్లు సురేశ్ జగ్గి, శశికాంత్, చెన్నకిషన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, జూలూరి రమేశ్‌బాబు, క్లబ్ సభ్యులు పాషా, సత్యం, నర్సింహ, అంజయ్య, జనార్ధన్‌రెడ్డి ఉన్నారు.

సొంతిల్లు ప్రతీ పేద కుటుంబం హక్కు


లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్యజ్యోతి): సొంత ఇల్లు అనేది ప్రతీ పేద కుటుంబ హక్కు అని, డబుల్ బెడ్ రూం ఇళ్ల ద్వారా ఆ కల సాకారమవుతోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మొయినాబాద్ పరిధి అజీజ్‌నగర్ సమీపంలో నిర్మించిన 36 డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద కుటుంబాలు గౌరవంగా జీవించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేదలకు ఇళ్లు నిర్మిస్తున్నారని తెలిపారు. అధికారంలోకొచ్చిన కొద్ది రోజుల్లోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ గౌత ంకుమార్, ప్యాక్స్ చైర్మన్ చంద్రారెడ్డి, నాయకులు షాబాద్ దర్శన్, కాలె శ్రీకాంత్, హన్మంత్‌యాదవ్, హన్మంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తహసీల్దార్ లాగిన్ ఐడీలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్‌వో హరిప్రియతో కలిసి రెవెన్యూ శాఖ పెండింగ్ అంశాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ భారతి, ఆర్ఓఆర్, టీజీపాస్ దరకాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలన్నారు. మండలాల వారీగా పెండింగ్ కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. కుల, నివాస, ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం లేకుండా చొరవ తీసుకుని పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో లాఆఫీసర్ చంద్రావతి, ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, శ్యాంప్రకాశ్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

కృష్ణా జలాల రాకతో నాయకుల ఆనందం


కెనాల్‌లో కృష్ణా నీటికి పూజలు చేస్తున్న నాయకులు

మాడ్గుల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న కృష్ణా సాగునీటి రాకతో ప్రజలు, నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద నాగిళ్ల వరకు డి82 కాలువ ద్వారా కృష్ణా నదీ జలాలు మండలంలోని అవురుపల్లి, చంద్రాన్‌పల్లి, దొడ్లపహాడ్‌ల నుంచి మాడ్గుల చెరువుకు చేరుతున్నాయని నాయకులు తెలిపారు. సోమవారం దొడ్లపహాడ్ కాలువలో నీటిని చూసి గంగమ్మకు పూజల చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డిల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భట్టు కిషన్‌రెడ్డి, నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కృషివల్లే మాడ్గులకు కృష్ణానదీ జలాల రాకతో రైతుల నీటి కరువు తీరనుందన్నారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ బొజ్జ సాయిరెడ్డి, నాయకులు రమేశ్‌గౌడ్, సూదిని కొండల్‌రెడ్డి యాదయ్యగౌడ్, జంగయ్యగౌడ్, మిద్దె రాములు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

కడ్తాల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అలైన్‌మెంట్‌ను మార్చి టవర్ల పనులు నిలిపివేసే వరకు పోరాటం కొనసాగిస్తామని కడ్తాల హైటెన్షన్ లైన్ భూనిర్వాసితులు అన్నారు. పొలాల మీదుగా హైటెన్షన్ లైన్ వేసి తమను రోడ్డు పాలు చేయొద్దని కోరారు. నిర్వాసితుల రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 22వ రోజుకు చేరాయి. గోరటి జంగయ్య, వెంకట్రాములు గౌడ్, రాములు, రామకృష్ణ దీక్షలో కూర్చున్నారు. శిబిరాన్ని బీజేపీ మండలాధ్యక్షుడు మహేశ్ సందర్శించి సంఘీబావం తెలిపారు.

పశువైద్య శిబిరం విజయవంతం

కందుకూరు, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): లేమూరులో సోమవారం పశు వైద్యశిబిరం నిర్వహించారు. పశు వైద్యాధికారి షాహిన్‌షేక్ ఆధ్వర్యంలో 56 పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. 19దూడలకు నట్టల నివారణ మందులు, 23పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు వేశారు. పశు వైద్యాధికారులు ఎం.దీప్తి, సంధ్యారాణి, సిబ్బంది సంగయ్య, రమేష్ పాల్గొన్నారు.


పశువులకు వైద్యం చేస్తున్న డాక్టర్ షాహిన్‌షేక్

కనుల పండువగా శ్రీవారి కల్యాణం

- అశ్వవాహన సేవ



వికారాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయ రజతోత్సవాలు సోమవారం తొమ్మిదో రోజు కనుల పండుగగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాత సేవ, మహాభిషేకం, నైవేద్యం, మంగళ హారతి, అర్చనలు అనంతరం శ్రీవారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని అశ్వ వాహనంపై ఊరేగింపు నిర్వహించి ఊయల సేవతో వేడుక నిర్వహించారు. వేడుకల్లో ఆలయ ధర్మకర్త లక్ష్మీనారాయణ, ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

రెండో రోజూ గూడ్స్‌ను అడ్డుకున్న సంగెంకలాన్ గ్రామస్తులు

- సమస్య పరిష్కారానికి ఫ్యాక్టరీ జీఎం హామీ



తాండూరు రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి):సంగెంకలాన్‌లోని చెట్టినాడు సిమెంట్ కర్మాగారం గూడ్స్ రైలును గ్రామస్తులు సోమవారం రెండోరోజూ అడ్డుకున్నారు. కర్మాగార రైలు పట్టాపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. గ్రామ సమీప బండలవాగు వద్ద రైల్వే ట్రాక్ పిల్లర్ల కారణంగా వరదంతా ఎస్సీ కాలనీలోకి వస్తోందన్నారు. విషయం తెలుసుకున్న కర్మాగార ప్రతినిధులు చేరుకొని గ్రామస్తుల సమస్య తెలుసుకున్నారు. వరదతో నష్టపోయిన వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అయినా ఆందోళన విరమించకపోవడంతో ఫ్యాక్టరీ జీఎం శేఖర్‌బాబు సంగెంకలాన్ ఎస్సీ కాలనీలో పర్యటించారు. వరదతో నష్టపోయిన వారికి నిత్యావసర సరుకులు, సామగ్రి అందజేస్తామని హామీ ఇచ్చారు. విషయం తెలుసుకున్న కరన్‌కోట్ ఎస్ఐ రాథోడ్ వినోద్, రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి రైలు ను అడ్డుకోవద్దని గ్రామస్తులకు సర్ది చెప్పారు.

గౌరారం స్కూల్ టీచర్‌కు రాష్ట్ర స్థాయి ఖ్యాతి

- మూతబడిన పాఠశాల పునః ప్రారంభం
- రాష్ట్ర విద్యాశాఖ ప్రచురించే ఎడ్యూసర్ ఈ-మ్యాగజైన్‌లో శ్రీనివాసాచారికి చోటు


విద్యార్థులను స్కూలులో చేర్చుకుంటున్న టీచర్ శ్రీనివాస్‌చారి(ఫైల్)



ఆమనగల్లు, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసాచారి కృషి ఫలితంగా ఆమనగల్లు మండలం గౌరారం పాఠశాలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు వచ్చింది. విద్యాశాఖ ప్రచురిస్తున్న ఎడ్యూసర్ ఈ-మ్యాగజైన్‌లో చోటుదక్కింది. అంకితభావంతో పనిచేస్తూ పాఠశాలకు గుర్తింపు తెచ్చిన హెచ్ఎం శ్రీనివాసాచారిని స్థానికులు అభినందించారు. గౌరారం ప్రైమరీ పాఠశాల గతంలో జీరో ఎన్రోల్‌మెంట్‌తో మూతబడింది. ఎంఈవో పాండు చొరవతో ఈ విద్యా సంవత్సరం పాఠశాలను పునఃప్రారంభించి శెట్టిపల్లి స్కూలులో పనిచేసే టీచర్ శ్రీనివాసాచారిని డిప్యూటేషన్‌పై ఇక్కడికి పంపారు. గ్రామంలో ప్రైవేట్‌కు పంపే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు పంపాలని తల్లిదండ్రులను ఆయన ఒప్పించారు. 8 మందితో పాఠశాల ప్రారంభమై క్రమంగా విద్యార్థుల సంఖ్య 16కు పెరిగింది. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో ఇటీవల మరో ఉపాధ్యాయుడిని కేటాయించారు. మూతబడిన స్కూలులో విద్యార్థుల సంఖ్య పెంపునకు కృషిచేసిన శ్రీనివాసచారిని విద్యాశాఖ అభినందించి, ఎస్సీఈఆర్టీ మ్యాగజైన్‌లో అతడి విజయ గాథను ప్రచురించింది.

తెలంగాణను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతున్న సీఎం


మంబాపూర్‌లో ఇందిరమ్మ గృహప్రవేశంలో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దేముల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతున్నారని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంబాపూర్‌లో జరిగిన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో ఎమ్మెల్యే పాల్గొని సహపంక్తి భోజనం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో పేదలకు సంక్షేమ పథకాలు అందలేదనిన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింతర్వాతే పేదలకు ఇళ్లు కట్టుకునే యోగం లభించిందని చెప్పారు. అలాగే రాష్ట్రంలో 60వేల మంది టీచర్లను ఈ ప్రభుత్వం నియమించిందన్నారు. గ్రూప్1 పరీక్ష నిర్వహించి 567 మందికి సీఎం నియామక ఉత్తర్వులిచ్చారని తెలిపారు. ఒకవైపు సంక్షేమ పథకాల అమలు, మరో వైపు ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అంజయ్య, వైస్‌చైర్మన్ నారాయణరెడ్డి, నాయకులు గాజీపూర్ నారాయణరెడ్డి, యువ నాయకులు మహిపాల్‌రెడ్డి, ఉప్పరిమల్లేశం, కాంగ్రెస్ ఎ-బ్లాక్ అధ్యక్షుడు లొంకనర్సిములు, కిరణ్‌కుమార్, రవిశంకర్, జితేందర్‌రెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బురద రోడ్డుతో అవస్థలు

- గోధుమగూడ సమీప రైల్వే బ్రిడ్జి వద్ద వాహనదారుల ఇక్కట్లు

వికారాబాద్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో వికారాబాద్ మండలం గోధుమగూడ గ్రామ సమీపంలో రైల్వే బ్రిడ్జి కింద బురద పేరుకపోయింది. దీంతో అటుగా వెళుతున్న వాహనాలు బురద ఇరుక్కుపోయి ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆ దారి గుండా ఎంతో మంతో మంది నిత్యం ప్రయాణించాల్సి ఉండగా ప్రస్తుత రోడ్డుతో అవస్థలు పడుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి బురద తొలగించి రోడ్డు బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బ్రిడ్జి కింద బురదలో కూరుకుపోయిన వాహనాలు

పునరుద్ధరణ పనులు చేపట్టాలి

బంట్వారం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ముంపు ప్రాంతాల్లో పునరుద్ధరణ పనులు చేపట్టాలని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. సోమవారం యాచారం, మాలసోమారం, తొర్మామిడి, బంట్వారం గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను, ధ్వంసమైన రోడ్లు, కల్వర్టులను పరిశీలించారు. రైతులకు పరిహారం చెల్లింపునకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు డి.మల్లేశం, శరణరెడ్డి, ఖాజాపాషా, చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


పంటను పరిశీలిస్తున్న మెతుకు ఆనంద్ తదితరులు

ఉద్యోగికి రిటైర్మెంట్ సర్వసాధారణం


సంపత్‌కుమార్ దంపతులను సన్మానిస్తున్న జెడ్పీ సీఈవో

శామీర్‌పేట, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి):ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సాధారణమని, విశ్రాంత జీవితాన్ని ఆనందంగా గడపాలని జెడ్పీ సీఈవో కాంతమ్మ ఆకాంక్షించారు. సోమవారం శామీర్‌పేట మండల పరిషత్‌లో ఇన్‌చార్జి ఎంపీడీవో, జెడ్పీ సూపరింటెండెంట్ సంపత్‌కుమార్‌ల రిటైర్మెంట్ కార్యక్రమంలో సీఈవో, డిప్యూటీ సీఈవో నీరజ, మాజీ ఎంపీపీ ఎల్లుబాయి, ఎంసిపల్లి సూపిరింటెండెంట్ రాజారత్నం, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, రాజకీయ నాయకులు వారిని సత్కరించారు.

గ్రూప్-2 ఉద్యోగాలు సాధించిన గణేశ్, సుష్మ

దోమ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రూప్2లో మండలానికి చెందిన ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. మల్లెపల్లి తండాకు చెందిన విస్లావత్ గణేశ్ ఎక్సైజ్ ఎస్సైగా, బట్ల చందారానికి చెందిన వర్ల సుష్మ మహిళా విభాగంలో జోనల్ స్థాయిలో 3వ ర్యాంకుతో సచివాలయంలో అసిస్టెంట్ సెక్షన్ అధికారిగా ఉద్యోగం సాధించారు. వారిని గ్రామస్తులు అభినందించారు.



మహేశ్వరం మండలం నాగారంలో రోడ్డుకు మరమ్మతులు చేయించడంలేదని గ్రామస్తులన్నారు. సోమవారం గుంతల్లో వరినాటు వేసి నిరసన తెలిపారు.
– మహేశ్వరం, సెప్టెంబరు 29

పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం


మాజీ ఉప ముఖ్యమంత్రి సుఖ్జిందర్‌సింగ్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే శంకర్

కొత్తూర్/నందిగామ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కొత్తూర్‌లోని పాపిరస్‌పోర్టు రిసార్టు వద్ద పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి, రాజస్థాన్ ఏఐసీసీ ఇన్‌చార్జి సుఖ్జిందర్‌సింగ్ రంధావాకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, పార్టీ నాయకులు సోమవారం ఘనస్వాగతం పలికారు. సుఖ్జిందర్‌సింగ్ కొత్తూర్ రాగానే ఎమ్మెల్యే, నాయకులు పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు. అనంతరం నందిగామలో నిర్వహించే కార్యక్రమానికి ఆయన బయలుదేరి వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ మున్సిపల్, మండల అధ్యక్షులు జె.సుదర్శన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, నాయకులు అంబటి ప్రభాకర్, కర్రోళ్ల సురేందర్, నవీన్‌చారి, ఐ.శ్రీనివాస్, దయానంద్‌గుప్తా, సాయిలు, రాందాస్‌నాయక్, వి.శేఖర్, సురేష్, విజయ్‌పాల్‌రెడ్డి, మాణయ్య ఉన్నారు. అలాగే ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నందిగామ మండలం చాకలిగుట్టతండా వద్ద నాయకులు కేంద్ర నేతకు స్వాగతం పలికారు. అనంతరం తండాలో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, శివశంకర్‌గౌడ్, రఘు, బాబర్‌ఖాన్, ఇబ్రహీం, నర్సింలు, రాజు, గబ్రు, తులసీరాం, బుచ్చయ్య, క్రిష్ణ, కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, సత్తయ్య, హరినాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రవీందర్, శేఖర్, శ్రీశైలం, శివ, సాములయ్య, నవాజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చాకలిగుట్ట తండాలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన సుఖ్జిందర్‌సింగ్ రంధావా, ఎమ్మెల్యే శంకర్

సంప్రదాయ బోధన అభినందనీయం

- మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్


రామ్‌నాథ్ కోవింద్‌కు జ్ఞాపిక అందజేస్తున్న స్వామిజీలు

మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్యజ్యోతి):భారతీయ సంస్కృతీ సంప్రదాయలు ఉట్టిపడేలా విద్యను బోధించడం అభినందనీయమని భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు.సోమవారం మండల పరిధి ఎన్కేపల్లిలో గల స్వామినారాయణ్ ఇంటర్‌నేషనల్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. విలువలు, సంస్కృతీ సంప్రదాయాలతో కూడిన విద్యను అందిస్తున్న ట్రస్ట్‌ను అభినందించారు. అన్ని రాష్ట్రాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసి అందరూ సమానమేనని చాటారన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల స్వామీజీలు, చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ గౌతంకుమార్, సీఐ పవన్‌కుమార్‌రెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కోళ్ల ఫామ్‌తో వేగలేకపోతున్నాం

- భరించలేని దుర్గంధం.. గ్రామస్తుల ఆవేదన


పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కందుకూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి):గ్రామానికి సమీపంలో ఉన్న లక్ష్మారెడ్డి కోళ్ల ఫామ్‌తో వేగలేకపోతున్నామని, దానిని తొలగించాలని, ఈగలు, దోమలు, లిట్టర్ దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని కొత్తగూడ గ్రామస్తులు వాపోయారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం పంచాయతీ కార్యదర్శి శ్రీహరికి వినతిపత్రం ఇచ్చారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. వర్షాకాలంలో కోళ్ల ఫామ్ నుంచి వస్తున్న దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని, ఈగలు, దోమలు ముసురుతూ ఇళ్లలో భోజనం చేయాలన్నా కష్టంగా మారిందని తెలిపారు. వెంటనే గ్రామ సమీపం నుంచి పౌల్ట్రీ ఫారాన్ని తొలగించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యదర్శి స్పందిస్తూ ఈ సమస్యపై ఎంపీడీవోకు నివేదిస్తానని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రామస్తులు సంజీవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, హన్మంతరెడ్డి, ఆర్.యాదయ్య, పి.తిరుపతిరెడ్డి, ఎండీ అమ్జాద్, సామ ప్రకాశ్‌రెడ్డి, యాదగిరిగౌడ్ ఉన్నారు.

నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


గణేశ్‌ను సత్కరిస్తున్న నాయకులు

మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్యజ్యోతి): తెలంగాణలో నిరుద్యోగులు సమస్యలతో సతమతవుతున్నారని, వారి సమస్యలు పరిష్కారానికి బీజేవైఎం పోరాటం సాగిస్తుందని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుండె గణేశ్ అన్నారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన ఆయన బాధ్యతలు చేపట్టే ముందు స్వగ్రామం రెడ్డిపల్లి నుంచి భారీ ర్యాలీతో నగరానికి వెళ్లారు. చిలుకూరు బాలాజీని దర్శించుకున్న అనంతరం మాట్లాడుతూ.. బీజేవైఎం నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తుందన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పజెప్పిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక నాయకులు ఆయనను సత్కరించారు. కార్యాక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే రత్నం, ప్రకాశ్, నాయకులు శ్రీకాంత్, చంద్రశేఖరరెడ్డి, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహారెడ్డి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తెలంగాణ రాష్ట్ర వృక్షం జమ్మి చెట్టు


జమ్మి మొక్కను నాటుతున్న శుభప్రద్ పటేల్

వికారాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దసరా రోజు పూజించుకునే జమ్మి చెట్టును తెలంగాణ వృక్షంగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గుర్తించిందని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. సోమవారం వికారాబాద్ మండల నారాయణపూర్ గ్రామంలోని సంగమేశ్వర దేవాలయంలో ఆయన జమ్మి మొక్కను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ ప్రతి ఊరిలోని గుళ్లలో జమ్మిచెట్టు ఉండాలనే ఉద్దేశంతో గ్రీన్ ఇండియా చాలెంజ్‌కు శ్రీకారం చుట్టారని, ఇందులో తాను భాగస్వామి కావడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన అన్నారు. ఆలయ కమిటీ సభ్యులు సోమిరెడ్డి, రాములు, నాయకులు అశోక్, సుజిత్‌తో కలిసి శుభప్రద్ మొక్క నాటి పూజ చేశారు.


పరిగి: బతుకమ్మ సంబురాల్లో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


తాండూరు పట్టణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


వికారాబాద్: వేంకటేశ్వర స్వామి ఆలయంలో..


యాలాల: బతుకమ్మలతో బయల్దేరిన మహిళలు


తాండూరు మున్సిపాలిటీలో బతుకమ్మకు పూజలు చేస్తున్న కమిషనర్ యాదగిరి

ఘనంగా సద్దుల బతుకమ్మ



వికారాబాద్, మర్పల్లిలో బతుకమ్మతో చిన్నారులు


కోట్‌పల్లి బార్వాద్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


మేడ్చల్ టౌన్: సోమారంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో సోమవారం సద్దుల బతుకమ్మ సంబురాలు ఘనంగా జరిగాయి. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు. అనంతరం సమీప చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.
- ఆంధ్రజ్యోతినెట్‌వర్క్, సెప్టెంబరు 29


ఘట్‌కేసర్ రూరల్ : బతుకమ్మతో అవుశాపూర్ మాజీ సర్పంచ్ ఏనుగు కావేరి మశ్చేందర్‌రెడ్డి


పెద్దేముల్: కందనెల్లిలో బతుకమ్మలతో మహిళలు


బొంరాస్‌పేట్: దేవ్లానాయక్ తండాలో బతుకమ్మ సంబురాలు


మర్పల్లి: బతుకమ్మతో మహిళలు


వికారాబాద్: శివరాంనగర్ కాలనీలో బతుకమ్మ వేడుకల్లో మహిళలు


ఘట్‌కేసర్: అన్నోజిగూడలోని మాజీ మున్సిపల్ చైర్మన్ నివాసంలో భారీ బతుకమ్మ


ధారూరు: బతుకమ్మలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న మహిళలు


వికారాబాద్ రామ మందిరంలో బతుకమ్మ వేడుకలు


బషీరాబాద్: బీజేపీ కార్యాలయం వద్ద బతుకమ్మలతో మహిళలు


దుద్యాల: బతుకమ్మలతో మహిళలు


మోమిన్‌పేట్: టేకులపల్లిలో బతుకమ్మ సంబురాల్లో మహిళలు


సరస్వతీ దేవిగా అమ్మవారి దర్శనం

వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం అమ్మవారు సరస్వతీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.


తూంకుంటలోని శ్రీ గాయత్రీ మహాక్షేత్రంలో..


ధారూరులో..


ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్ ద్విశక్తిమాతా ఆలయంలో సరస్వతీ దేవి ఆలంకరణలో అమ్మవారు


శివశంకర వేదపీఠంలో


కొడంగల్: ఎస్బీఐ ఎదుట సరస్వతీ దేవి అవతారంలో అమ్మవారు


ఘట్‌కేసర్ శ్రీరామ కళ్యాణ కామేశ్వరి నవశక్తి దేవాలయంలో..


సరస్వతీ హోమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్‌రెడ్డి


కులకచర్లలో దుర్గమాతకు బంగారు ముక్కుపుడక సమర్పిస్తున్న రాఘవేందర్

ఇంటింటికీ 'కాంగ్రెస్ బాకీ కార్డులు'


బాకీ కార్డులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

కోట్‌పల్లి సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ తీసుకువచ్చిన బాకీకార్డు ఉద్యమంలో భాగంగా సోమవారం ఎన్నారంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ బకాయి కార్డులను పంపిణీ చేశారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు పడ్డ బకాయిలను గుర్తు చేసేందుకే ఈ ఉద్యమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుందరి అనిల్. వెంకటేష్ యాదవ్, కొండల్ రెడ్డి, మొగులయ్య ఉన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

బంట్వారం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మర్పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోచారం యాదగిరి, నర్సిములు అన్నారు. మండల కేంద్రంతో పాటు యాచారం, నూర్లపూర్ తదితర గ్రామాల్లో సోమవారం స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు వ్యవసాయ అధికారులతో కలిసి కాంగ్రెస్ నాయకులు భారీవర్షాలతో నష్టపోయిన పంటలను వారు పరిశీలించారు.

విజయానికి ప్రతీక విజయదశమి

వికారాబాద్/బంట్వారం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయదశమి విజయానికి ప్రతీక అని ప్రముఖ వక్త ముడుపు యాదిరెడ్డి అన్నారు. పట్టణంలోని నర్సింగ్ గౌలికర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో విజయ దశమి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. 1925లో డాక్టర్ గోల్వల్కర్ ఆలోచనలతో ఆర్ఎస్ ఆవిర్భవించిందన్నారు. అదేవిధంగా బంట్వారం మండలంలోని సల్బత్తాపూర్‌లో వక్త సిద్ధిరామేశ్వర్, బక్క సుదర్శన్ రెడ్డి, ఆనంద్‌రెడ్డి ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్నారు.

'ప్రీప్రైమరీ' నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

కొడంగల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రీప్రైమరీ వ్యవస్థ అమలు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి అన్నారు. ఆమె కొడంగల్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ అంగన్‌వాడీ సమస్యలపై నిరసన తెలిపితే అక్రమ అరెస్టులు చేయించడం సమంజసం కాదన్నారు. నిరసనలో తమపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

గ్రూప్-1 ఉద్యోగం సాధించడం అభినందనీయం


తాండూరులో గ్రూప్-1 సాధించిన యువకుడిని సన్మానిస్తున్న పట్టణ వాసులు

తాండూరు రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన న్యాయవాది గోపాల్ కుమారుడు క్రాంతి గ్రూప్-1 ఉద్యోగం సాధించడం అభినందనీయమని కర్ణాటకకు చెందిన వ్యాపారి రవూఫ్ అన్నారు. గ్రూప్-1లో ఎంపీడీవో ఉద్యోగం సాధించిన క్రాంతిని తాండూరులోని న్యాయవాది గోపాల్ నివాసంలో సోమవారం శాలువాతో సన్మానించి స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్రం మిర్యాణ్‌కు చెందిన పూజారి నర్సింహులు, న్యాయవాది గోపాల్ తదితరులున్నారు.

పదవులతో నిమిత్తం లేకుండా అభివృద్ధి


ఆలయాల చుట్టూ సీసీరోడ్డు వేయిస్తున్న మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పదవులతో నిమిత్తం లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. పోచారం మున్సిపాలిటీ అన్నానగర్‌లో వైఎస్సార్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం పోచమ్మ, ఎల్లమ్మ ఆలయాల చుట్టు సీసీరోడ్లు వేయించారు. వైఎస్సార్ ట్రస్టు ముందుండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు సామల కొండల్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సోమయ్య, వెంటక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టిసారించాలి


వైద్య శిబిరంలో పాల్గొన్న మహిళలు

తాండూరు రూరల్, సెప్టెంబరు 29, (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంపై దృష్టిసారించాలని కాంగ్రెస్ పార్టీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తంచంద్ అన్నారు. జినుగుర్తి పీహెచ్‌సీ వద్ద స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 200మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అవేవిధంగా టీబీ వ్యాధిగ్రస్తులకు కూడా న్యూట్రీషన్ కిట్లు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రశీద్, నాయకులు రాంలింగారెడ్డి, అజ్మత్‌అలీ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నీటిసంపులో పడి బాలుడి మృతి

పెద్దేముల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నీటిసంపులో పడి మూడేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని కందనెల్లి తండాలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కందనెల్లితండాకు చెందిన కిషన్ అనిత దంపతుల కుమారుడు లడ్డు(3) ఆడుకుంటూ వెళ్లి ఇంటివెనకాల నూతన గృహనిర్మాణం కోసం తవ్విన నీటిసంపులో పడ్డాడు. కుటుంబసభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే బాలుడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో పండగ వేళ ఆ ఇంట్లో విషాదం అలుముకుంది.

బ్యానర్ల తొలగింపు



మర్పల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ ప్రకటనతో మర్పల్లి మండలంలో రాజకీయ బ్యానర్‌లు, పోస్టర్‌లను పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఎన్నికలు ముగిసేంత వరకు ఎలాంటి బ్యానర్లు, పోస్టర్లు పెట్టరాదని అధికారులు ఆదేశించారు.

రైతుల ప్రయోజనాలే లక్ష్యం


మాట్లాడుతున్న చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి

బషీరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా పాలక వర్గ సభ్యులతో కలిసి సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని నవాంద్గీ పీఏసీఎస్ చైర్మన్ ఎ.వెంకట్ రాంరెడ్డి అన్నారు. సోమవారం బషీరాబాద్‌లోని సొసైటీ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో వెంకటయ్య సొసైటీ వార్షిక నివేదిక, లావాదేవీలు, ఆస్తి, అప్పులు, జమా ఖర్చులు, బకాయిల వసూళ్లకు సంబంధించి పలు అంశాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఐదున్నరేళ్లలో సొసైటీ ద్వారా రూ.9కోట్ల 33లక్షల 60వేల పంటరుణాలు, రూ.87లక్షలకు పైగా దీర్ఘకాలిక రుణాలు రైతులకు ఇచ్చినట్లు తెలిపారు. బంగారం ఆభరణాలపై 543మందికి రూ.5కోట్ల 15లక్షలు అప్పుగా ఇచ్చామని చెప్పారు. సొసైటీ ఆర్థికాభివృద్ధికి రూ.2కోట్ల నాబార్డు నిధులు తీసుకొచ్చి రైసుమిల్లు, గోదాం నిర్మించినట్లు తెలిపారు. ఈ ఏడాది నుంచి రైసు మిల్లును అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అనంతరం పెట్రోల్ బంక్ ఏర్పాటు విషయంలో కొనసాగుతున్న వివాదంపై చైర్మన్, పాలకవర్గం మధ్య కొంతసేపు చర్చకు దారితీసింది. ఈ సమావేశంలో లక్ష్మీనారాయణపూర్ బ్రాంచ్ మేనేజర్ రాములు, డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, రంగారెడ్డి, నారా గోపాల్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, గోపాల్, అనసూయ, సిబ్బంది బందెయ్య, ఫారుఖ్, తుకారం తదితరులున్నారు.

సంక్షిప్తంగా..

బీజేపీ మండల అధ్యక్షుడిగా జగదీశ్

బొంరాస్‌పేట్: బీజేపీ మండల అధ్యక్షుడిగా ఉప్పరి జగదీశ్‌ను సోమవారం ఎన్నుకున్నారు. గతంలో మండల అధ్యక్షుడిగా ఉన్న శ్రావణ్‌గౌడ్ బీఆర్ఎస్‌లో చేరడంతో ఆయన స్థానంలో ఉప్పరి జగదీశ్‌ను ఎన్నుకున్నట్లు రాష్ట్ర నాయకుడు బాబాయ్య నాయుడు తెలిపారు.

ఉత్తమ ట్రైనర్ సర్టిఫికెట్ల ప్రదానం

కొడంగల్/కొడంగల్ రూరల్: ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ (వ్యక్తిత్వ వికాసం) సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో భాగంగా కొడంగల్ పట్టణానికి చెందిన భీమారాజు, దస్తప్పలు ప్రతిభ కనబర్చారు. హైదరాబాద్‌లోని సోమాజీగూడ కాత్రియా హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఇంపాక్ట్ గురూజీ శ్రీ గంపా నాగేశ్వర్‌రావు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీత్రినాథ్ దాసరి, సాయి అపేక్ష, కొలిపాక నాగలక్ష్మి, పుష్పలత, జనార్దన్‌రెడ్డి, పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

దోమ: మోత్కూర్ గ్రామంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు దుర్గమాత శ్రీ సరస్వతీదేవి ఆలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా బోనమ్మ ఆలయం దగ్గర చిన్నారులకు నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమంలో కేఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థపకురాలు రాజేశ్వరమ్మ పాల్గొన్నారు. చిన్నారులతో అక్షరభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి శ్రీకాంత్, భాస్కర్, లింగయ్య పాల్గొన్నారు.

గుండె ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

తాండూరు: ఆహారపు అలవాట్లు మార్చుకొని గుండె ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) అధ్యక్షుడు, ప్రముఖ వైద్యులు డాక్టర్ జయప్రసాద్ అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్, పతంజలి యోగ సమితి, ఆర్య సమాజ్, యువ జాగృతి ఆధ్వర్యంలో సోమవారం రన్ ఫర్ హెల్తీ హార్ట్ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్‌చౌక్ నుంచి సాయి తరుణ్ ఆస్పత్రి వరకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు శరణు బసప్ప, మాజీ కౌన్సిలర్ సోమ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆధునిక వైద్యసేవలందించడమే లక్ష్యం

శామీర్‌పేట: పేదలకు ఆధునిక వైద్య సేవలందించడమే శ్రీజీవ హెల్త్‌కేర్ ల్యాబ్ లక్ష్యమని రసాయన ఇంజనీర్ రవీంద్రనాథ్ గుట్ట తెలిపారు. తూంకుంట మున్సిపల్‌లో రసాయన ఇంజనీర్ రవీంద్రనాద్ గుట్ట, శ్రీజీవ హెల్త్‌కేర్ ల్యాబ్ డైరెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కల్యాణి, షేక్ అబ్దుల్ హాది పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

తాండూరు రూరల్: జినుగుర్తి శివారులోని ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ కళాశాలలో హైదరాబాద్ రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ శిబిరం సోమవారం ముగిసింది. రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేషన్ డీన్ డాక్టర్ గోవర్ధన్, భాగయ్య, పీవీ.రావు, సుధారాణి, డాక్టర్ రాజవర్ధన్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలపై అవగాహన

దోమ: మండలంలోని బొంపల్లి గ్రామంలో ఎస్ఐ వసంత్ జాదవ్ సోమవారం సీసీ కెమెరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంగ్రామం

(ఐదో పేజీ తరువాయి)

బంట్వారం, వికారాబాద్, ధారూరు, మోమిన్‌పేట్, మర్పల్లి, నవాబ్‌పేట్, కోట్‌పల్లి మండలాల పరిధిలో 115 ఎంపీటీసీ, 11 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. రెండో విడతలో బషీరాబాద్, తాండూరు, యాలాల్, పెద్దేముల్, పరిగి, పూడూరు, కులకచర్ల, చౌడాపూర్, దోమ మండలాల్లో 112 ఎంపీటీసీ, 9 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

అక్టోబర్ 21 నుంచి పంచాయతీ ఎన్నికలు

జిల్లాలో రెండు డివిజన్ల పరిధిలో రెండు విడతలుగా ఎన్నికలు జరగనున్నాయి. రెండు, మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం 594 పంచాయతీలు, 5,058 వార్డులు ఉండగా, జిల్లాలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ అక్టోబరు 21 నుంచి నవంబరు 8వ తేదీ వరకు కొనసాగనుంది. రెండో విడత పంచాయతీ ఎన్నికలు 21 నుంచి నవంబరు 4వ తేదీ వరకు, మూడో విడత ఎన్నికలు 25 నుంచి నుంచి నవంబరు 8వ తేదీ వరకు కొనసాగనున్నాయి. రెండో విడతలో 11 మండలాల పరిధిలో 288 గ్రామ పంచాయతీలు, 2,490 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనుండగా, రెండో విడతలో 9 మండలాల పరిధిలో 306 గ్రామ పంచాయతీలు, 2,568 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. తొలి విడతలో కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, దుద్యాల్, బంట్వారం, వికారాబాద్, ధారూరు, మోమిన్‌పేట్, మర్పల్లి, నవాబ్‌పేట్, కోట్‌పల్లి మండలాల పరిధిలో 288 పంచాయతీలు, 2,490 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మూడో విడతలో బషీరాబాద్, తాండూరు, యాలాల్, పెద్దేముల్, పరిగి, పూడూరు, కులకచర్ల, చౌడాపూర్, దోమ మండలాల పరిధిలో 306 పంచాయతీలు, 2,568 వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు జరగనున్నాయి.

21న పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్

జిల్లాలో జరగనున్న పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు వచ్చేనెల 21వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి ఓటర్ల జాబితా ప్రదర్శిస్తారు. ఆ రోజు నుంచి 23వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 24న నామినేషన్లు పరిశీలించిన అర్హులైన అభ్యర్థుల జాబితా అదే రోజు సాయంత్రం 5 గంటల తర్వాత ప్రకటిస్తారు. ఏమైనా అభ్యంతరాలుంటే 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా అప్పీలు చేసుకోవాల్సి ఉంటుంది. వచ్చిన అప్పీళ్లను 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లో పరిష్కరిస్తారు. 27వ తేదీ, సాయంత్రం 3 గంటల్లోగా నామినేషన్లు ఉప సంహరించుకునేందుకు అవకాశం ఇచ్చారు. అదేరోజు సాయంత్రం పోటీలో ఉండే అభ్యర్థులు, వారికి కేటాయించిన గుర్తులను ప్రకటిస్తారు. 27వ తేదీన నవంబరు 4వ తేదీ ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికల పోలింగ్ నిర్వహించి అదేరోజు మధ్యాహ్నం రెండు నుంచి ఓట్ల లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు.

అక్టోబరు 25న మలివిడత ఎన్నికల నోటిఫికేషన్

మరో విడత ఎన్నికలకు సంబంధించి అక్టోబరు 25వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అదేరోజు నుంచి 27వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 28న నామినేషన్ల పరిశీలన పూర్తయిన తర్వాత అర్హులైన అభ్యర్థుల జాబితా అదే రోజు సాయంత్రం 5 గంటల తర్వాత ప్రకటిస్తారు. అభ్యంతరాలుంటే 29వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా అప్పీల్ చేసుకోవాలి. 30న సాయంత్రం 5 గంటల్లోగా అప్పీళ్లను పరిష్కరిస్తారు. 31వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్లు ఉపసంహరించుకునే అవకాశం కల్పించారు. అదేరోజు సాయంత్రం పోటీలో ఉండే అభ్యర్థుల వివరాలు, వారికి కేటాయించిన గుర్తులను ప్రకటిస్తారు. నవంబరు 8వ తేదీన ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికల పోలింగ్ జరిపి, అదేరోజు మధ్యాహ్నం రెండు నుంచి ఓట్లు లెక్కించి ఫలితాలను ప్రకటించనున్నారు.